
# కొడుకులు

పి.చంద్



## "రాము వచ్చిండా?"

ఓపికంతా కూడదీసుకుని మంచంలోనుండి తల బలవంతంగా పైకి లేపి అడిగింది కనకమ్మ.

ఆమె భర్త రాజీరుకు ఏ చెప్పాలో అర్థంకాలేదు. అలా ఎన్నిసార్లు అడిగిందో గుర్తులేదు.

అడిగిన ప్రతిసారి అతను ఒకే ఒక్క సమాధానం చెప్పిండు.

"వస్తున్నాడు కావచ్చు. అంత దూరంనుండి రావాలి కదా సమయానికి బస్సు దొరికిందో లేదో" అంటూ నసిగిండు.

ఆ సమాధానం అతనికే సంతృప్తిని ఇవ్వలేదు. అయినా ఆమెను ఓదార్చడానికి అతను అలా చెప్పక తప్పలేదు.

మూడు రోజులుగా కనకమ్మ మంచంనుండి లేవటంలేదు. కడుపులోకి ఇన్ని గంజి నీళ్లయినా పోలేదు. పూళ్లోని ఆర్.యం.పి.డాక్టర్ కోటేశం వచ్చి చూసి పట్నం తీసుకు పొమ్మన్నాడు. ఏవో నాలుగు మందు బిళ్లలు ఇచ్చిపోయిండు.

పట్నం తీసుకుపోవాలంటే మాటలా? అతని జీవితమంతా అదే పల్లెలో గడిచిపోయింది. ఒకటి రెండుసార్లు పట్నం పోయినా అదేదో పనిమీద పోయిండు తప్ప హాస్పటళ్ల చుట్టూ తిరిగింది లేదు. దానికి తోడు చేతిలో చిల్లి గవ్వలేదు. అతని ఇద్దరు కొడుకులు చెరో దారి పట్టిండ్లు.

కొడుకులు గుర్తుకురాగానే అతని కండ్లల్లో నీళ్లూరినాయి.

"బంగారంలాంటి ఇద్దరు కొడుకులు, నీకెందయ్యా ముసలితనంలో కాలుమీద కాలేసుకుని బతకవచ్చు" ఎవరో అన్నమాటలు గుర్తుకు వచ్చినవి.

కాని కొడుకులుఉండి ఏం లాభం! ఆపద సమయంలో ఎవరూ లేకుండాపోయిండ్లు. అట్లని కొడుకులను తప్పు పట్టలేకపోయిండు. రెక్కలు వచ్చాయి, వాళ్ల దారిలో వాళ్లు పోయిండ్లు.

ఆకాశమంతా మబ్బులు కమ్మి, ఇప్పుడో అప్పుడో కుండపోతగా వర్షం కురిసేటట్టుగా ఉన్నది. వర్షం కురిస్తే ఊరిని చుట్టేసిఉన్న ఏరుపొంగితే ఊరికే రాకపోకలు బందయితవి. ఎప్పుడు మబ్బులు చూసిన ఉప్పొంగె అతని మనసులో ఆ పూట మాత్రం మెగులును చూసి కోపం కల్గింది.

చల్లగాలి రివ్వున వీస్తుంది. ఆ గాలికి ఇంట్లోని దీపం రెపరెపలాడింది. ఇప్పుడో అప్పుడో ఆరిపోయే దీపం లాగే కనకమ్మ ప్రాణం కొట్టుమిట్టాడుతుందనే ఆలోచన అతనికి భయం గొల్పింది. కమ్ముకొంటున్న చలిని, భయాన్ని పారదోలేందుకు చుట్ట ముట్టించిండు. పొగాకు అంతగాలేని మొక్కి చుట్ట చిటపటలాడింది. చెంపలన్నీ లొట్టలు పడంగా గాఢంగా పొగ పీల్చుకున్నాడు. ప్రాణం కాస్త తేలికపడ్డట్టుగా అన్పించింది. గుప్పుగుప్పున పొగ వదులుతుంటే అతని ఆలోచనలు సుళ్లు తిరగసాగాయి.

***** *****

"ఇరుసవడ్లు మోయలేనివాడు గుట్టును లాబట్టడానికి పోయండట, ఊరి మీద ఏది ఎట్లాపోతే మనకెందుకు, గోపల్‌రావు దొర చాలమంచోడు. వాళ్ల అయ్య సంగతి తెల్వదు నీకు, వాళ్ల అయ్య రాజేశ్వరరావు కాలంలో గడి ముందునుండి చెప్పులేసుకొని పోవాలంటే ఉచ్చపడేది. ఆ రోజుల్లో ఆయన తోవల వస్తాంటే ఎదురుగా ఎవరు పోయేటోళ్లు కాదు"

తండ్రి మాటకు అడ్డు పోయిండు చంద్రయ్య.

"ఇటువంటి దొర ఏమైండు, మట్లే గలిసిండు"

"నిజమే బిడ్డా రాజేశ్వరరావు దొరను నిజాం కాలంల కమ్యూనిస్టు వాళ్లు చంపేసిండ్లు. కాని బిడ్డా గోపాల్‌రావు దొరవాళ్ల అయ్యంత చెడ్డోడుకాదురా!"

"ఎందుకుకాదు, రూపం మారింది స్వభావం ఒక్కటే. అప్పుడు రాజేశ్వర్‌రావు దొర ఏ పదవి లేకుండానే చుట్టు పదిఊళ్లను ఏలిండు. ఇప్పుడు ఆయన కొడుకు రాజకీయ నాయకుడైపోయి, రాష్ట్రంలో మంత్రి అయిపోయి రాజ్యం ఏలుతున్నడు. వేలకు వేలున్న వాళ్ల భూములు పోయినవా? ఆస్తులు తరిగినవా? ఇంకా ఇబ్బడి ముబ్బడిగా పోరిగిపోయినవి"

"అదంతా నిజమేరా, కాని పెద్దోళ్లతోని వైరం పెట్టుకొని మనం బతకలేంరా! మన ఐసత్(స్థాయి)ని బట్టి మెదలాలి బిడ్డా!"

కాని ఆ మాటలు చంద్రయ్య వినలేదు.

కూలిరేట్ల పెంపుదలకోసం మొదలైన లొల్లి దొరల భూములు ఆక్రమించుకునేదాకా ఎదిగింది. కొట్లాటలు, పోలీసుల జోక్యం షరా మామూలైంది. మాలవాడలోని ఏసోబ్ కొడుకును పోలీసులు ఎన్‌కౌంటర్‌పేర కాల్చేసిన తర్వాత గోపాల్‌రావు దొర ఊరికే రావటమే మానేసిండు.

చంద్రయ్య ఇంటికి రాక చాల రోజులైంది. ఆడ పోలీసులు ఇంటి మీదికి వచ్చి నానా హంగామా చేసి పోయటోళ్లు.

పెద్దకొడుకు రాములు అంతకు పదేండ్ల ముందే రిజర్వ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిండు.

ఒక కొడుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు పడ్తే, మరో కొడుకు ప్రభుత్వం తరఫున పోరాడే వాడయిండు.

పోలీసుల్లో జయినయినపుడు పెద్దకొడుకు రాముల్ని ఉద్దేశించి "మన వంతన లేని పని నీకెందుకురా"అంటు వారించిండు రాజీరు.

రాములు తండ్రి మాట వినలేదు. ఎదుగుబొదుగు లేని జీవితం. ఆరు కాలాలు కష్టపడ్డా బతుకు ఎల్లని పరిస్థితి రాములును రిజర్వు కానిస్టేబుల్ అవటానికి దోహదపడ్డాయి. కాని తిండి తిప్పలు లేకుండా, ఉన్నకాడ ఉండకుండా తిరిగేపని కావటంతో ఇంటికిసరిగా వచ్చిందిలేదు. బస్తర్‌లో కుటుంబంతోని ఉంటున్నాడు.

దాదాపు మూడేళ్ళయ్యింది వాణ్ని చూడ క. అడపాదడపా రాములు పంపే డబ్బులకు తోడు చాతనైనపుడు ఇంత కూలి నాలి చేసుకుంటు ఇంతవరకు నెట్టుకొచ్చిండు. కాని ఇప్పుడు మునపటిలా కాళ్లు చేతులు ఆడకుంటైంది.

కనకమ్మ ఆరోగ్యం సరిగా లేని సంగతి పెద్దకొడుక్కి ఉత్తరం వ్రాసిండు. కాని అది ముట్టేది ఎప్పుడు? ముట్టిన తరువాత వచ్చేది ఎప్పుడు తెలియటం లేదు. ఇక చిన్నోని సంగతి అసలేమి తెలియటంలేదు. తెలిసినా వాడు ఇంటికి వచ్చే అవకాశాలు కనిపించటంలేదు. ఇంటికి వచ్చి ప్రమాదం కొని తెచ్చుకోవటంకంటే వాడు రాకుంటేనే బాగుంటుందని మనసులో లేకపోలేదు.

అందుకే కనకమ్మ చంద్రయ్యమీద ఆశ వదులుకున్నది. మరోసారి ఆయా సంతోనే "రాము వచ్చిండా!" అంటూ మూలిగింది.

భార్యను చూస్తుంటే రాజీరు మనసు తరక్కపోసాగింది. ఈ అవసానదశలో పిల్లలు దగ్గర ఉండాలని ఎవరు మాత్రం కోరుకోరు! ఆ భాగ్యంకూడా లేకుండా పోయింది కదా! రాజీరు మనసులో విచారం కమ్ముకొన్నది.

వర్షం మొదలైంది. విసురుగా జల్లు ఇంట్లోకి కొడుతుంది. ఆ విసురుకు ఒకసారిగా దీపం ఆరిపోయింది. రాజీరు లేచి మళ్లీ దీపం ముట్టించిండు.

కడుపులో పెద్దగా ఆకలి లేకున్నా భార్యకు ఇంత ఏమన్నాచేసి పెద్దామని పొయ్యి రాజేసిండు. తడిసిపోయిన కట్టెలు ఒక మానాన మండటం లేదు. ఎలాగో తంటాలు పడి ఇంత ఉడికేసిండు.

"ఏమన్నా ఎంగిలి పడు" అంటూ మంచం కాడికి అన్నం గిన్నెతో వచ్చి

అన్నాడు.

కనకమ్మ బదులేమి పలుకలేదు. ఆమె కనుకొనుకుల్లో కన్నీరుఊరి ఎండి పోయిన చెంపల మీదుగా జాలువారింది.

"ఇట్లా ఏడ్చుకుంటా కూసుంటేఎట్లా. ఎదన్నా తింటే ఓపిక వస్తది. ఇవ్వాలో రేపో పెద్దోడు వస్తడు. పట్నం తీసుకపోతాడు" సముదాయింపుగా అన్నాడు.

కనకమ్మ తలఅడ్డంగా తిప్పింది. దాని అర్థం 'కొడుకు రాడనో? అన్నం వద్దనో'. రాజీరుకు అర్థంకాలేదు.

"నీవు ఇట్లా మొండి పట్టుపడ్తె ఎలా"అంటూ అన్నం కలిపి నోట్లో పెట్టడానికి ప్రయత్నించిండు. కాని కనకమ్మకు ముద్ద మింగుడు పడలేదు. ఆయాసం వచ్చి మళ్లీ రొప్పసాగింది.

**భార్యను చూస్తుంటే రాజీరు మనసు తరక్కపోసాగింది. ఈ అవసానదశలో పిల్లలు దగ్గర ఉండాలని ఎవరు మాత్రం కోరుకోరు!**

రాజీరుకు ఏం చెయ్యాలో తోచక గాబరా పడిపోయిండు. చల్లగా ఉంది కదా అని ఇంట్లోని రెండు చదుర్లు తెచ్చి కప్పిండు. కాసేపు ఆయాసంతో తల్లడిల్లి కనకమ్మ మెల్లగా కళ్లు మూసుకున్నది.

రాజీరు అలాగే మంచం కొసన కూచుండిపోయింది. అతని మనసు మొద్దుబారి పోతున్నది. ఏవో ఆలోచనలు పిచ్చిపిచ్చిగా గజిబిజిగా కమ్ముకోసాగాయి. వర్షం జోరెత్తింది.

కుండపోతగా ఒక్కటే వర్షం. ఈ వర్షానికి మానేరుకు వరదరావచ్చు. 'వరద వస్తే రాము ఎలా వస్తాడు! అసలింతకు వాడు వస్తున్నాడా? లేదా?' ఏ సంగతి తెలియదు. పిల్లలంటే ఎంత పడిసచ్చేది, కాని ఈ కష్ట సమయంలో ఎవరు లేరైరి.

ఎవర్ని తప్పు పట్టాలో అర్థంకాలేదు. జీవితమంతా ఎద్దులా కష్టపడ్డాడు. కాని ఏం లాభం. చివరికి భార్య మంచాన పడ్తే మందులు ఇప్పించలేని దుస్థితి ఎందుకు వచ్చింది? ఏమో అతనికి మాత్రం ఏం తెలుసు. పనిచేయలేని ఎద్దు చివరికి చేరేది కాటికాడికే కదా! రెక్కలు ముక్కలు చేసుకుని బతికే మనిషి రెక్కలుడిగిన తరువాత పరిస్థితి ఏమిటి?

ఏవేవో ఆలోచనలు.

పిచ్చిపిచ్చి ఆలోచనలు.

'మనం ఎన్నాళ్లు కష్టపడ్డా ఏంలాభం ఉండదు. కష్టపడేవాడికి తిండికి ఎల్లక, చమటచుక్క కార్చనివాడు భోగ విలాసాలతో బతికే సమాజం ఉన్నంత కాలం మనిషికి సుఖంలేదు' ఆ మాటలు అంటున్నపుడు చంద్రయ్య మొఖం ఆవేశంతో ఎంతగా ఎర్రబారేది.

ఆ ఆవేశమే వాణ్ని ఇంటిపట్టున ఉండకుండా చేసింది.

వాడైనా ఒక్కక్షణం ఇటువస్తే ఎంత బాగుండేది. కాని వాడు రాడు. వాడు వచ్చిండని తెలిస్తే పోలీసులు వస్తారు. ఆ పోలీసుల్లో రాముకూడా ఉంటాడా? ఉంటే తన కండ్లముందు ఒకరిపై ఒకరు కాల్చుకుంటారా?!

ఏమో ఎవరికి ఎరుక. ఆయుధం పట్టినవాడు పేదింటి బిడ్డే కదా! అణచిపెట్టేది కూడా పేదింటి బిడ్డతోనే.

కన్ను మనదే కాలు మనదే. ఏమిటీ చిత్రమైన ఆలోచన!'-

చుట్టకోసం వెతికాడు. చుట్ట ముట్టించుకుని నాలుగు దమ్ములు లాగేసరికి చుట్టలో పొగాకు లేక చిటపటలాడుతు ఆరిపోయింది. లేచి తన మంచం కాడికి నడిచిండు. నిదురరాకున్నా అలాగే మంచంలో ఒరిగిండు. సుళ్లు తిరిగే ఆలోచనలమధ్య ఎప్పుడో కాని నిదుర పట్టలేదు.

***** *****

రాజీరు నిదుర లేచేసరికి పొద్దు పొడిచింది. ఎండపొడకు చెట్లు చేమలు, గడ్డి గాదం సమస్తం కడిగేసినట్టుగా ఉంది.

'బాగా తెల్లారినట్టుందే' అంటూ తనలో తనే గుణిగిండు.

కనకమ్మ మంచంలో కండ్లుమూసుకుని ఉంది.

ఇంకా నిదురనుండి లేచినట్టు లేదనుకున్నాడు. పరీక్షగా చూసేసరికి మూతిమీద ఈగలు ముసురుతున్నది కనిపెట్టి గుండెగుబిల్లుమన్నది.

"ఏమే...ఏమే!" అంటూ తట్టి లేపిండు. కాని అప్పటికే చల్లబడ్డ వొళ్లు కట్టె చరుచుకొని పోయి ఆ పూవుకు మొత్తం శరీరం కదిలింది.

రాజీరుకు మాట రాలేదు. క్షణకాలం బిరిపోయిండు. బాధతో ఒకటే తీర్గ కన్నీరు కార్చిండు.

ఊరొల్లంత వచ్చిండ్లు.

"ఇక కావల్సిన ఏర్పాటు ఏదో చేయాలి కదా?" అన్నారు.

"కొడుకులు ఎవరు లేకుండానే!"

"వస్తే రాముడు రావాలి. కాని ఆయనకు కబురు అంది వచ్చేసరికి మురిగి పోదు" అన్నారు ఎవరో.

"పెద్దాయన్ని విచారించండి, ఏం చెపుతాడో!"

రాజీరు మౌనంగా తలాడించిండు.

శవయాత్రకు ఏర్పాట్లు మొదలయినవి.

రాజీరు చేతిలో చిల్లిగవ్వ లేదని తెలిసి ఆయన అన్న కొడుకు ముందుబడి ఏర్పాట్లు చూసిండు.

మరి కాసేపట్లో శవయాత్ర ఆరంభమౌతుండగా దూరంగా పోలీసులు కనిపించిండ్లు...

రాము వస్తున్నడో ఏమోనని ఆశతో అందరితోపాటు రాజీరు చూసిండు.

కాని రాముడు రానేలేదు. తల్లి దహన సంస్కారానికైనా చంద్రయ్య వస్తాడేమోననే ఉద్దేశ్యంతో స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చిన సంగతి తెలిసి ఊళ్లోని జనం ఎవరు ఏమీ మాట్లాడలేదు.

మౌనంగా శవయాత్ర ఆరంభమైంది. ■


## తెల్లమచ్చలు

అనేక సంవత్సరముల నిరంతర పరిశ్రమ, పరిశోధన తరువాత తెల్లమచ్చల చికిత్సలో విజయమును పొందియున్నాము. మా చికిత్స ఎంతో ప్రభావకరమైనది. త్వరితముగా పని చేయునది, అంటే చికిత్స ప్రారంభించిన వెంటనే మచ్చ యొక్క రంగు మారుటకు మరియు మచ్చలు ఏర్పడుటకు గల శరీర అంతర్గత వికారములు దూరము చేస్తూ మచ్చలను నివారిస్తూ, శాశ్వతముగా సహజ చర్మపు రంగులోనికి మారుస్తుంది. ఇప్పుడు ప్రచారము నిమిత్తము 'మొదట పరీక్షించి చూడండి' అను స్కీమును అనుసరించి 7 రోజుల మందు ఉచితముగా ఇవ్వబడుతున్నది. మొదట మందుల ప్రభావమును పరీక్షించి సంతృప్తులైన తరువాత చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు, ఇతరుల వద్ద చికిత్స పొందుతున్న రోగులు కూడా ఈ అవకాశమును తప్పక ఉపయోగించుకోగలరు. రోగి యొక్క వయస్సు, మచ్చ గల స్థానము మరియు మచ్చలు ఎన్ని రోజుల నుండి ఉన్నది పూర్తిగా తెలియజేయండి.

## గుప్తరోగములకు ఉచిత మందు

ప్రాచీన ఆయుర్వేద గ్రంథ విజ్ఞానాన్ని మథించి గడిచిన అనేక సంవత్సరముల పరిశోధన తరువాత మాచే తయారుచేయబడిన పరీక్షితమైన మందుల ద్వారా గుప్తరోగముల చికిత్సలో పూర్తి విజయమును పొందియున్నాము. ఈ మందుల ద్వారా స్వప్నదోషము, మూత్రము ద్వారా వీర్యము పోవుట, స్పెరన్‌టోరియా, శీఘ్రస్ఖలనము, నపుంసకత్వము, అంగబలహీనతలు మొదలగునవి పూర్తిగా తగ్గిపోవును. శరీరములో నూతన ఉత్సాహమును అనుభవించగలరు. రతి సామర్థ్యము పెరుగును. పురుష మందులను పరీక్షించి నమ్మకమును పొందగలరని ప్రచారము నిమిత్తము 7 రోజుల మందును ఉచితముగా ఇస్తున్నాము. రోగులు ఫలితమును చూసి, సంతృప్తులైన తరువాత పూర్తి చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు ఒక్కసారి మందు వాడి చూడండి. రోగి వయస్సు, సమస్యలు పూర్తిగా నిస్సంకోచముగా వ్రాయగలరు. పూర్తి చికిత్స ఒకేసారి తీసుకోవాలని అనుకునేవారు కూడా వ్రాయవచ్చును.

## తెల్లవెంట్రుకలు, వెంట్రుకలు రాలుటను అరికట్టు చికిత్స

ఏ సమయములోనైనా ఏ కారణము వల్లనైనా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట జరిగినచో చింతించవద్దు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథములలోని పరీక్షితమైన నమూనాలు ఆధారముగా తయారుచేయబడిన మందుల ద్వారా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట పూర్తిగా తగ్గిపోవును. క్రొత్త వెంట్రుకలు నల్లగా, దట్టముగా పెరుగును. మెదడును చల్లగా నుంచును. జ్ఞాపశక్తిని వృద్ధి చేయును. వయస్సు, తెల్లవెంట్రుకలు లేదా వెంట్రుకలు రాలుట ఎంతకాలము నుంచి ఉన్నది, స్త్రీ లేదా పురుషులా వివరముగా తెలుపగలరు. చికిత్స కొరకు వ్రాయగలరు. ధర రూ. 160/- స్పెషల్ కోర్సు రూ. 260/-.

**GAYA AYURVED BHAVAN (GV-2)**

**P.O. KATRI SARAI (GAYA) 805 105 PHONE : 06112 - 289361**